# సాక్షి
## చిత్తూరు

శనివారం । 26 । ఆగస్టు । 2023




**మూగజీవులకు మెరుగైన వైద్యం**

పశువుల వ్యాధి నిర్ధారణకు ప్రభుత్వం వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ వెటర్నరీ ల్యాబ్‌లను ప్రారంభించింది. - 8లో



**అట్టహాసంగా అర్జున తపస్సు**

పుత్తూరులోని ద్రౌపదీ సమేత ధర్మారాజస్వామి ఆలయంలో వైభవంగా బ్రహ్మోత్సవాలు సాగుతున్నాయి. - 8లో

| | గరిష్టం | కనిష్టం |
|---|---|---|
| చిత్తూరు | 36 | 24 |
| తిరుపతి | 36 | 26 |
| తిరుమల | 31 | 21 |
| గూడూరు | 37 | 26 |
| నగరి | 36 | 26 |

## న్యూస్‌రీల్

### బోయకొండ గంగమ్మకు ప్రత్యేక పూజలు


విశేషాలంకరణలో అమ్మవారు

చౌడేపల్లె : బోయకొండ గంగమ్మకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువనే అమ్మవారి ఆలయాన్ని అర్చకులు శుద్ధి చేసి నిత్య కైంకర్యాలు సమర్పించారు. రాహుకాల సమయంలో సంప్రదాయబద్ధంగా అభిషేకం జరిపించారు. అనంతరం అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. శ్రావణ శుక్రవారం, వరలక్ష్మీవ్రతం సందర్భంగా పెద్దసంఖ్యలో మహిళలు ఆలయానికి చేరుకుని పిండి దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

### కాణిపాకంలో బ్రహ్మోత్సవ ఏర్పాట్లు


రాజగోపురానికి రంగు వేస్తున్న కూలీలు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు ప్రారంభించారు. సెప్టెంబర్ 18 చవితి రోజు నుంచి అక్టోబర్ 8వ తేదీ వరకు నిర్వహించే స్వామివారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మొదటగా ఆలయ రాజగోపురానికి రంగులు వేస్తున్నారు. గతంలో ఈ గోపురానికి పంచ వర్ణాలు ఉండగా ప్రస్తుతం ఆగమశాస్త్ర ప్రకారం తెల్లరంగు వేయిస్తుండడం విశేషం.


అమ్మవారి కంకణధారణలో అర్చకులు


అమ్మవారి స్వర్ణరథాన్ని లాగుతున్న భక్తులు

# శాస్త్రోక్తం..వరలక్ష్మీవ్రతం


- జిల్లాలో మిన్నంటిన వేడుకలు
- భక్తిశ్రద్ధలతో వ్రతం ఆచరించిన మహిళలు


శ్రీకాళహస్తి : ప్రత్యేక అలకరణలో అమ్మవారు


గాజుల అలంకారంలో తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ


ప్రత్యేక అలంకరణలో ఆదిలక్ష్మీదేవి

శ్రీకాళహస్తి/తిరుచానూరు(చంద్రగిరి) : జిల్లాలో వరలక్ష్మీవ్రతాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం నుంచి ఉపవాస దీక్షలతో వ్రతం ఆచరించి మొక్కులు తీర్చుకున్నారు. తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయ ఆస్థాన మండపంలో శుక్రవారం వరక్ష్మీవ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీపద్మావతీ అమ్మవారి ఉత్సవమూర్తిని ఆస్థాన మండపానికి వేంచేపు చేసి పద్మపీఠంపై ఆశీనులను చేశారు. రోజా, చామంతి, మల్లె, సంపంగి, తులసి, పన్నీరు ఆకు, మరువము, తామరపూలు, వృక్షి వంటి పుష్పాలతో అమ్మవారిని ఆరాధించారు. వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలకు సత్సంతానం, దీర్ఘ మాంగల్యసౌఖ్యం, సిరిసంపదలు, ఆరోగ్యం, కుటుంబ సౌఖ్యం వంటి ఎన్నో మహాఫలాలు కలుగుతాయని అర్చకులు దీవెనలు అందించారు. సాయంత్రం అమ్మవారిని స్వర్ణరథంపై కొలువుదీర్చారు. అనంతరం తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. తిరుపతి తాతయ్యగుంట గంగమ్మతల్లి గాజుల అలంకరణలో భక్తులను మంత్రముగ్ధులను చేశారు. అలాగే శ్రీకాళహస్తీశ్వరాలయంలోని బ్రహ్మగుడి వద్ద నిర్వహించిన వ్రతానికి మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అర్చకులు కలశ స్థాపన చేసి లక్ష్మీపూజను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. మహిళల చేత కుంకుమ పూజ చేయించారు. రాపూరులోని పెంచలకోనలో స్వయంభువుగా వెలసిన ఆదిలక్ష్మీదేవికి భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు తరలివచ్చారు.



"

**అమ్మవారి అనుగ్రహం**

వరలక్ష్మీవ్రతం ఆచరించడం వల్ల లోకం సుభిక్షంగా ఉంటుంది. అష్ట ఐశ్వర్యాలు, సుఖశాంతులను అమ్మవారు అనుగ్రహిస్తారు. శ్రీ మహాలక్ష్మి అవతరించిన దివ్యస్థలం తిరుచానూరులో వరలక్ష్మీ వ్రతం ఆచరించడం ఆనవాయితీగా వస్తోంది. ఆలయం వద్ద ఉన్న ఆస్థాన మండపంలో పాంచరాత్ర ఆగమం ప్రకారం అర్చకులు వరలక్ష్మీ వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

– భూమన కరుణాకరరెడ్డి, టీటీడీ చైర్మన్


నగరిలో వరలక్ష్మీవ్రతం ఆచరిస్తున్న మంత్రి రోజా


శ్రీకాళహస్తిలో వ్రతం ఆచరిస్తున్న మహిళలు

### 28న జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన



చిత్తూరు కార్పొరేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 28వ తేదీన జిల్లాలో పర్యటించనున్నారు. శుక్రవారం ఈ మేరకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది.

**సీఎం పర్యటన షెడ్యూల్ ఇలా..**

- ఉదయం 9.45 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారు
- 9.55కి అక్కడి నుంచి హెలీకాప్టర్‌లో బయలుదేరి నగరి మండలం కీలపట్టుకు చేరుకుంటారు
- 10.45 బహిరంగ సభాస్థలికి రోడ్డు మార్గాన విచ్చేస్తారు
- మధ్యాహ్నం 12.35 గంటలకు జగనన్న విద్యాదీవెన పథకాన్ని ప్రారంభించి ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు
- 12.45 గంటలకు సభాస్థలి నుంచి బయలుదేరి 12.50 గంటలకు డిగ్రీ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకుంటారు
- 1.25 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 1.45 తిరుపతి జిల్లా రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి గన్నవరం చేరుకుంటారు.

### ముమ్మర ఏర్పాట్లు


రోడ్‌షో మార్గంలో ఏర్పాటు చేసిన బారికేడ్లు

నగరి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 28వ తేదీన నగరికి విచ్చేస్తున్న సందర్భంగా నిర్వహించనున్న సభకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యమంత్రి రోడ్ షో నిర్వహించే మార్గంలో ఎలాంటి తోపులాటలకు అవకాశం లేకుండా పకడ్బందీగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. సభా వేదికను జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు.

# మూగజీవులకు మెరుగైన వైద్యం

పాడి పరిశ్రమకు అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. క్షేత్రస్థాయిలో రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. పశువులకు మెరుగైన వైద్యం అందించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా తొలుత 1962 వాహనం పేరిట ఇంటిముంగిటకే చికిత్సలు అందిస్తోంది. ఈ క్రమంలోనే పశువ్యాధి నిర్ధారణకు వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ వెటర్నరీ ల్యాబ్‌లకు శ్రీకారం చుట్టింది. రూ.16.10 లక్షల చొప్పున వెచ్చించి ప్రతి నియోజకవర్గంలో ఓ ప్రయోగశాలను ప్రారంభించింది. మూగజీవులకు సైతం అత్యున్నత వైద్యం అందుబాటులోకి తీసుకువచ్చింది.

- పాడి రైతులకు అండగా వైఎస్సార్ పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల
- నియోజకవర్గానికి ఒకటి చొప్పున ప్రారంభం
- పశువులకు సత్వర చికిత్సే లక్ష్యంగా సేవలు





నగరి పట్టణంలో ఏర్పాటుచేసిన వైఎస్సార్ పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల (ఇన్‌సెట్) పేడ పరీక్ష చేస్తున్న టెక్నీషియన్

నగరి : ప్రజారోగ్యంతో పాటు పశువైద్యంపై కూడా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. పాడి రైతుకు అండగా నిలబడుతోంది. ఇప్పటికే సంచార పశుఆరోగ్య సేవల కోసం 1962 వాహనాన్ని ప్రారంభించి పశువులకు ఇంటిముంగిటే సేవలు అందిస్తోంది. అలాగే పశువుల రోగ నిర్ధారణకు నియోజకవర్గానికి ఒకటి చొప్పున వైఎస్సార్ పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల (వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ వెటర్నరీ ల్యాబ్) ను అందుబాటులోకి తెచ్చింది. ఒక్కో ప్రయోగశాల ఏర్పాటుకు రూ.16.10 లక్షలు వెచ్చించింది. జిల్లాలో సుమారు 13 లక్షల మేర పశువులు ఉన్నాయి. వీటికి సోకే వ్యాధుల పరీక్ష నిమిత్తం జిల్లాలో ఒక్క ప్రయోగశాల మాత్రమే ఉండేది. ప్రస్తుతం 7 వైఎస్సార్ పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాలలు ప్రారంభించారు. మూగజీవాలు, సన్నజీవాలు, పెంపుడు జంతువుల్లో బయటకు కనిపించే గాయాలకు వైద్యం చేయించడం పెద్ద సమస్య కాదు. అయితే కడుపునొప్పి, చెవిపోటు, గుండెల్లో మంట తదితర సమస్యలతో బాధపడుతుంటే పసిగట్టడం కష్టమే. గతంలో వాటిని మండల కేంద్రాలకు తీసుకెళ్లి వైద్యుల సలహా మేరకు మందులు వాడేవారు. వాటి నుంచి నమూనాలు సేకరించి చిన్నాచితకా పరీక్షలను ఆస్పత్రుల్లోనూ.. పెద్ద పరీక్షలను జిల్లాస్థాయి ల్యాబ్‌ల్లో చేయించేవారు. సిబ్బంది కొరత వల్ల పరీక్షలు చేయాలంటే కొన్ని సందర్భాల్లో రోజులు, ఒక్కోసారి నెలల తరబడి సమయం పట్టేది. ఈ లోగా వ్యాధి తీవ్రత పెరిగి పశువులు మరణించేవి. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. నియోజకవర్గ స్థాయిలో అందుబాటులోకి వచ్చిన వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ వెటర్నరీ ల్యాబ్స్ ద్వారా సత్వరమే వ్యాధి నిర్ధారణ చేస్తున్నారు. దీంతో సకాలంలోనే పశువులకు వైద్యం అందించే వెసులుబాటు వచ్చింది.

### ల్యాబ్‌లో చేసే టెస్టులు ఇవీ..

- పేడ పరీక్ష
- నాసికా స్రవాల పరీక్ష
- రక్త పరీక్ష
- మూత్ర పరీక్ష
- కణజాల పరీక్ష
- చర్మవ్యాధి పరీక్ష
- పొదుగు వ్యాధి నిర్ధారణ పరీక్ష
- యాంటీ బయోటిక్ సెన్సిటివిటీ పరీక్ష
- బయోకెమికల్ అనాలసిస్ పరీక్ష

### జిల్లాలోని పశువుల వివరాలు

| | | |
|---|---|---|
| ఆవులు | : | 4.5 లక్షలు |
| గేదెలు | : | 2000 |
| గొర్రెలు | : | 3.5 లక్షలు |
| మేకలు | : | 5 లక్షలు |

### మంచి ఆలోచన



మూగజీవాల కోసం దేశంలో ఎక్కడా లేనివిధంగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ల్యాబ్స్ ఏర్పాటు చేయడం గొప్ప విషయం. ఇదవరకు జిల్లాకు ఒకటి మాత్రమే ఉండేది. ప్రస్తుతం నియోజకవర్గానికి ఒక ల్యాబ్ ఉంది. వీటితో నాణ్యమైన సేవలు అందించడంతో పాటు ఆరోగ్యకరమైన పశువుల ఉత్పత్తి సాధ్యమవుతోంది. సంచార పశు ఆరోగ్య సేవలతో పాటు ల్యాబ్‌ల ఏర్పాటు మంచి ఆలోచన.
– టి.గోవిందయ్య, డీడీ, పశుసంవర్ధకశాఖ

### సద్వినియోగం చేసుకోవాలి



నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటుచేసిన వైఎస్సార్ పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాలలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి. పశువులకు సంబంధిత వ్యాధి నిర్ధారణకు 9 రకాల పరీక్షలు ల్యాబ్‌లో చేస్తున్నాం. ఈ పరీక్షలకు ల్యాబ్ టెక్నీషియన్ అందుబాటులో ఉంటారు. వ్యాధి నిర్ధారించుకుంటే అందుకు తగిన మందులు వైద్యులు అందిస్తారు. తద్వారా పశువుల త్వరగా వ్యాధి నుంచి బయటపడే అవకాశముంటుంది. – వాసు, ఏడీ, పశుసంవర్ధక శాఖ

# రైతు సంక్షేమానికి 'భరోసా'



ఆర్‌బీకే ప్రారంభించిన అనంతరం మంత్రి రోజాను సత్కరిస్తున్న రైతులు

నగరి : అన్నదాతల సంక్షేమానికే ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు మంత్రి ఆర్కే రోజా తెలిపారు. శుక్రవారం మండలంలోని ముడిపల్లెలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి పనులు పరుగులు తీస్తున్నాయన్నారు. ముఖ్యంగా వ్యవసాయరంగానికి ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోందని చెప్పారు. గతంలో పంట సాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాలు కావాలంటే రైతులు గ్రామాల నుంచి వ్యవసాయ కేంద్రానికో, పట్టణాల్లోని ఎరువుల దుకాణాలకో వెళ్లాల్సివచ్చేదన్నారు. దీంతో సమయం వృథా కావడంతోపాటు ఎరువులను, విత్తనాలను గ్రామాలకు తరలించేందుకు రవాణా ఖర్చులు కూడా భరించాల్సి వచ్చేదని వెల్లడించారు. ప్రస్తుతం అన్నదాతలకు ఆ ఇబ్బంది తప్పిందని, ఆయా గ్రామాల్లో ఆర్‌బీకే ద్వారా సరఫరా చేస్తున్నామని వివరించారు. పంట సాగుకు అవసరమైన సలహాలు అందించేందుకు, సమస్యల పరిష్కారానికి వ్యవసాయశాఖ సిబ్బంది అందుబాటులో ఉంటున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుచూపుతో ప్రవేశపెట్టిన పథకాలను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని వెల్లడించారు. నగరి నియోజకవర్గ వ్యాప్తంగా 60 రైతు భరోసా కేంద్రాలున్నాయని వాటిలో సగానికి పైగా భవనాల నిర్మాణం పూర్తయిందన్నారు. అందుబాటులోకి వచ్చిన సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం మంత్రి రోజాను రైతులు, గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీ కన్నియప్ప, సర్పంచ్ ప్రకాష్, ఎంపీటీసీ సభ్యులు సులోచనమ్మ, పీఏసీఎస్ చైర్మన్ తిరుమల రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుదర్శన నాయుడు, మండల సచివాలయ కన్వీనర్ హరి, మాజీ ఎంపీపీ జయచంద్రారెడ్డి, స్థానిక నాయకులు కె.చంద్రారెడ్డి, టి.గోవిందయ్య, కె.వెంకటేశ్వర్లు, ఎస్.గుణశేఖర్, టీపీ శేఖర్, పురుషోత్తం, రవికుమార్, ఎం.చంద్ర, కె.నాగరాజు పాల్గొన్నారు.

# అనుమానాస్పదంగా యువకుడి మృతి

కుప్పం : స్థానిక ప్యాలెస్ రోడ్డులోని ఓ ప్రైవేట్ లాడ్జిలో అనుమానాస్పదంగా ఓ యువకుడు మృతి చెందినట్లు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. గుడుపల్లె మండలం గుడికొత్తూరు గ్రామానికి చెందిన వెంకటస్వామి కుమారుడు వినోద్ (25) కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బెంగళూరుకు చెందిన ఓ మహిళతో రెండేళ్ల క్రితం వివాహమైనా విభేదాలు రావడంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి వినోద్ పట్టణంలోని ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. జులాయిగా తిరుగుతూ ఉండేవాడు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం కుప్పం వచ్చిన వినోద్ ఓ లాడ్జి వద్ద అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. వినోద్‌ను ఎవరో హత్య చేశారని బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నివేదిక అనంతరం పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టనున్నట్లు తెలిపారు.



వినోద్ మృతదేహం

# కర్ణాటక మద్యం విక్రేత అరెస్ట్

చిత్తూరు అర్బన్: నగరంలోని మూడో గేటు వద్ద కర్ణాటక మద్యం, సారా విక్రయిస్తున్న వి.అలేక్‌శర్మ(24) అనే యువకుడిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి 20 లీటర్ల సారా, 192 ప్యాకెట్ల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ మాధవస్వామి తెలిపారు. విచారణలో గుడిపాల మండలం రాసనపల్లెకు చెందిన ప్రేమ్‌కుమార్ అనే వ్యక్తి తనకు మద్యం అందజేసినట్లు నిందితుడు వెల్లడించాడన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. నిందితుడిని కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించామని వివరించారు. దాడిలో సెబ్ సీఐ జోగేంద్ర పాల్గొన్నారు.



నిందితుడి అరెస్టు చూపుతున్న ఎస్ఈబీ పోలీసులు

# పేదలకు ఉచితంగా న్యాయసేవలు

గుడిపాల: పేదలకు ఉచితంగా న్యాయసేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్ తెలిపారు. శుక్రవారం చిత్తపార పంచాయతీ రాయల్‌చేను ఎస్టీ కాలనీలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కోర్టులంటే భయపడాల్సిన అవసరం లేదన్నారు. చట్టాలపై అవగాహన లేకపోవడం వల్లే భూసమస్యలు వంటివి తలెత్తుతున్నాయని చెప్పారు. రాయల్‌చేనును ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దనున్నట్లు వెల్లడించారు. గుడిసెల్లో నివసించే వారికి ఇంటి పట్టాలు అందించి, గృహ నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ రాజశేఖర్ రెడ్డిని ఆదేశించారు. ప్రతి ఒక్కరికీ ఆధార్, రేషన్ కార్డు అందించాలని సూచించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి మూర్తి, కార్మికశాఖ సహాయ కమిషనర్ ఓంకార్, సహాయ ప్రాజెక్ట్ అధికారి వెంకటరమణ, తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్, మాజీ సర్పంచ్ రవి, ఏఎస్ఐ చలపతి, పంచాయతీ కార్యదర్శి శివ, వీఆర్‌ఓ సురేష్, గ్రామపెద్ద శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కరుణకుమార్



## వరసిద్ధుని సేవలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ అనుపమ చక్రవర్తి దంపతులకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న అధికారులు

కాణిపాకం (యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామిని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనుపమ చక్రవర్తి శుక్రవారం దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా విచ్చేసిన న్యాయమూర్తికి ఆలయ సూపరింటెండెంట్ రంగస్వామి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామివారి తీర్థప్రసాదాలు, చిత్రపటం అందించారు.

## జిల్లాకు 80 ట్రాన్స్‌ఫార్మర్లు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో విద్యుత్ అవసరాల నిమిత్తం 80 ట్రాన్స్‌ఫార్మర్లు వచ్చాయని ట్రాన్స్‌కో టెక్నికల్ ఈఈ సుబ్బారావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 140 కిలోమీటర్ల కండక్టర్లు సైతం వచ్చాయన్నారు. సంబంధిత ఏఈలు వర్క్ ఆర్డర్లు పెట్టి మెటీరియల్ డ్రా చేసుకోవాలని సూచించారు.

## ఏనుగుల దాడిలో పంటల ధ్వంసం



ఏనుగులు తొక్కేసిన వరి పైరు

పెద్దపంజాణి: మండలంలోని తిప్పిరెడ్డిపల్లె గ్రామం వద్ద గురువారం రాత్రి 8 ఏనుగుల గుంపు విధ్వంసం సృష్టించాయి. గంగులప్ప, బాబు, వినోద్ అనే రైతులు సాగు చేస్తున్న వరిపైరును తొక్కి నాశనం చేశాయి. ఏనుగుల కారణంగా సుమారు రూ.50వేల పంట నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగుల సంచారం అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

## శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 18 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 67,308 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 26,674 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.82 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టోకెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టోకెట్లు లేని భక్తులకు 15 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టోకెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.



# అట్టహాసంగా అర్జున తపస్సు

- వైభవంగా ద్రౌపదీ సమేత ధర్మరాజ స్వామి బ్రహ్మోత్సవాలు
- ఘనంగా సర్వభూపాల వాహన సేవ
- శాస్త్రోక్తంగా విమాన మహోత్సవం



ఊరేగింపుగా వస్తున్న కామాక్షీ సమేత సదాశివేశ్వరుడు



తపస్సు మాను అధిరోహించిన అర్జునుడు

పుత్తూరు రూరల్: పట్టణంలోని ద్రౌపదీదేవీ సమేత ధర్మరాజులస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. చివరి అంకంలోని తొలి రోజైన శుక్రవారం అర్జునుడి తపస్సును మెచ్చి పరమశివుడు పాశుపతాస్త్రం అనుగ్రహించే ఘట్టం భక్తులను ఆకట్టుకొంది. ఈక్రమంలో ఉదయం 6 గంటలకు అర్చకులు హిమాచలంబాబు, మోహన్ ఆధ్వర్యంలో స్థానిక మంచినీళ్ల గుంట నుంచి సంరక్షకుడు పోతురాజు ముందు నడుస్తుండగా గెరిగ ఆలయానికి చేరుకుంది. గెరిగ నీటితో అమ్మవారిని అభిషేకించి వరలక్ష్మీదేవి అలంకరణ చేసి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం నాయిబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సర్వభూపాల వాహనంపై రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామిని కొలువుదీర్చి ఉత్సవం జరిపించారు. ఉదయం 10 గంటలకు క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో కామాక్షీ సమేత సదాశివేశ్వరస్వామిని మేళతాళాలు, భక్తుల మంగళ హారతుల నడుమ ఊరేగింపుగా ద్రౌపదీదేవి ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం భక్త జనసందోహం మధ్య శాస్త్రోక్తంగా అర్జున వేషధారి తపస్సు మాను అధిరోహించారు. మధ్యాహ్నం స్థానిక ఎలక్ట్రికల్ వర్కర్స్ సంఘం ఆధ్వర్యంలో అన్నప్రసాదం నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు గుండ్లపుత్తూరు గ్రామస్తుల ఆధ్వర్యంలో ఉత్తర గోగ్రహణం ఘట్టాన్ని నిర్వహించారు. అనంతరం బలిజ అభ్యుదయ సేవా సమితి ఆధ్వర్యంలో అమ్మవారికి సారెను సమర్పించారు. రాత్రి 9గంటలకు పట్టణ పురవీధుల్లో స్వామిఅమ్మవార్లు ఊరేగుతూ స్థానిక రైల్వే స్టేషన్ వద్దకు చేరుకోగా ప్రత్యేక బాణాసంచా వేడుకలు నిర్వహించారు. అనంతరం పాటకచ్చేరి వీనుల విందుగా సాగింది. అనంతరం పుత్తూరు లారీ ఓనర్స్ సంఘం ఆధ్వర్యంలో వరలక్ష్మీదేవి ద్రౌపదమ్మ విమాన మహోత్సవం నిర్వహించారు. రాత్రి 11 గంటలకు బలిజ సంఘం ఆధ్వర్యంలో ద్రౌపదీ తీర్థం అనబడే మంచినీళ్ల గుంట వద్ద అలుగును ప్రత్యేకంగా అలంకరించి, బాణసంచా, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. కుంభాగ్రముపై (పచ్చికుండపై 4 అడుగుల కత్తిని తలకిందులుగా నిలబెట్టుట) అలుగును నిలబెట్టారు. రాత్రి 12 గంటలకు కుమ్మర సంఘం ఆధ్వర్యంలో కాళికాదేవికి ఇలావంతుని బలి ఇచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ లారీ మోహన్, సభ్యులు ముకుందప్రకాష్, సెల్వరాజ పిళ్లై, మునిరాజా, లక్ష్మీసుధ, నిర్మల, మహాదేవి, ఆలయ నిర్వాహకులు సాల్వాకం ఏలుమలైమొదలి, పళని మొదలి, గోపీ మొదలి, పెరుమాళ్ మొదలి, కుప్పుస్వామి మొదలి పర్యవేక్షించారు. డీఎస్పీ వై.శ్రీనివాసరావ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు. స్కౌట్ అండ్ గైడ్స్ మాస్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విద్యార్థులు సేవలందించారు.